


ముప్పవరం షిర్డిసాయి మందిరం వద్ద అలంకరణ



మార్టూరులో మహాచండీగా..



బాపట్ల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

శక్తి స్వరూపిణి.. జగజ్జనని

దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో కుంకుమ పూజలు, అమ్మవారికి అలంకరణలు చేస్తున్నారు. జగన్మాత వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిస్తుండడంతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంటుంది. పలుచోట్ల బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, బాపట్ల, అద్దంకి, మార్టూరు

సీట్ల కేటాయింపుపై కసరత్తు

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయి పక్షం రోజులవుతున్నా జిల్లా పరిషత్తు కార్యాలయంలో బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సీట్లు కేటాయించడంపై కసరత్తు పూర్తి కాలేదు. జడ్పీలో పని చేస్తున్న మొత్తం పది మంది పరిపాలన అధికారుల్లో ముగ్గురిని మినహాయించి మిగిలినవారిని బదిలీ చేశారు. వారి స్థానాల్లో బదిలీపై వచ్చిన ఏవోలు విధుల్లో చేరిపోయారు. వీరితో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వీరందరికీ విభాగాలను కేటాయించి ఆఫీస్ ఆర్డర్ ఇస్తే ఆయా సీట్ల బాధ్యతలను నిర్వహిస్తారు. పరిపాలన అధికారులను ఏయే విభాగాల్లో నియమించాలనే దానిపైనే కసరత్తు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు పాలకవర్గంతో చర్చించిన తర్వాత సీఈవో జ్యోతిబసు ఓఓ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పక్షం రోజులవడంతో సీట్లను కేటాయించకపోవడంతో సీఈవో సూచనల మేరకు సిబ్బంది ఆయా పనులు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఉద్యోగులకు సీట్లు కేటాయించనున్నట్లు సమాచారం.

పత్తి కొన్నారు.. డబ్బులివ్వడం లేదు

గుంటూరు: గుంటూరుకు చెందిన నేరెళ్ల హరిప్రసాద్ పత్తి కొనుగోలు చేసి.. డబ్బులు ఇవ్వడంలేదని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన బాధితులు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. గుంటూరు కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిన మంత్రిని బాధితులు కలిశారు. నిందితుడి రూ.1.90 కోట్లు చెల్లించాల్సి ఉందని, తమకు పత్తి అమ్మిన వారంతా వచ్చి డబ్బులు అడుగుతున్నారని, ఆ డబ్బులు రాకుంటే తామంతా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఉందంటూ ఓ బాధితురాలు వాపోయారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సమస్య పరిష్కరించాలని సూచించారు. నేదరు బాధితులతో కలెక్టర్ మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు.

దగ్గరి మిల్లులకే ధాన్యం

న్యూస్‌టుడే, బాపట్ల

ర్యాండమైజేషన్ రద్దుతో రైతుకు ప్రయోజనం

నిబంధనలు సరళతరం చేసిన ప్రభుత్వం

ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై అన్నదాతలు తమకు ఇష్టమైన మిల్లులకు ధాన్యం రవాణా చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ పౌరసరఫరాల అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. వైకాపా పాలనలో ప్రవేశపెట్టిన ర్యాండమైజేషన్ విధానం వల్ల ఆన్‌లైన్‌లో కేటాయించిన దూరంగా ఉన్న మిల్లులకు ధాన్యాన్ని పంపించటానికి సాగుదారులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. వారిపై రవాణా ఖర్చుల కింద అదనపు భారం పడింది.

5.64లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

జిల్లాలో ఖరీఫ్‌లో 2.17 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మొత్తం 5.64 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిది లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచనున్నారు. తేమ, బరువు తూచే యంత్రాలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. కస్టమ్ రైస్మిల్లింగ్ విధానంలో రైతులు తమకు సమీపంలోని రైస్‌మిల్లులకు ధాన్యాన్ని రవాణా చేసి విక్రయించే వారు. వైకాపా ప్రభుత్వం ఈ విధానాన్ని తొలగించింది. కొత్తగా ర్యాండమైజేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రైతు కొనుగోలు కేంద్రానికి ధాన్యం నమూనా తెచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో 40 కి.మీ. దూరంలోని రైస్ మిల్లులకు కేటాయించేవారు. ట్రాక్టర్, లారీల్లో ధాన్యాన్ని తీసుకుని రైస్‌మిల్లుకు వెళ్లి బస్తాలు దించి రావటానికి 24 గంటలకు పైగా సమయం పట్టేది. దీని వల్ల రవాణా వ్యయంతో పాటు రైతులపై ఇతర ఖర్చుల భారం పడింది. ప్రభుత్వం చెల్లించే రవాణా ఛార్జీలు సరిపోయేవి కావు. అదనంగా రూ.రెండు నుంచి మూడు వేల ఖర్చు అయ్యేది. ధాన్యం బాగా లేవని మిల్లర్ తిరస్కరిస్తే వేరే ప్రాంతానికి తరలించే అవకాశం ఉండక తక్కువ ధరకు విక్రయించి అన్నదాతలు నష్టపోయారు.



- ❖ 2022-23లో జిల్లాలో ఖరీఫ్, రబీలో సేకరించిన ధాన్యం: 50 వేల మెట్రిక్ టన్నులు
- ❖ 2023-24లో జిల్లాలో ఖరీఫ్, రబీలో సేకరించిన ధాన్యం: 33 వేలు
- ❖ 2024-25లో ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం: 50 వేలు



❖ త్వరలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ పాలనలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు తెలుసుకున్న సీఎం చంద్రబాబు ర్యాండమైజేషన్ విధానాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం సేకరణ నిబంధనలు సరళతరం చేయటం వల్ల రైతులు సులువుగా ధాన్యాన్ని విక్రయించుకుంటారు. అదనపు రవాణా ఖర్చుల భారం ఉండదు. వైకాపా పాలనలో ధాన్యం విక్రయించిన రైతులకు రెండు నెలల వరకు నగదు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. కూటమి ప్రభుత్వం రైతులకు సత్వరం చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంటోంది.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం:

జిల్లాలో పండించిన ధాన్యం విక్రయించటానికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ర్యాండమైజేషన్ విధానాన్ని రద్దు చేయటం వల్ల సాగుదారులు వారి సమీపంలో ఉన్న మిల్లులకు ధాన్యాన్ని తరలించే అవకాశం లభించింది.

– చంద్రశేఖర్, పౌరసరఫరాల డీఎం


మాకు కొంత.. మీ ఇష్టం అంతా..!

ఈనాడు, అమరావతి

వ్యాపారులకు కొందరు అధికారుల అభయం

వినుకొండ కేంద్రంగా విచ్చలవిడి బయో ఉత్పత్తుల విక్రయం

ప్రకాశం, పల్నాడు జిల్లాల సరిహద్దు ప్రాంతం.. సుమారు 200 గ్రామాలకు పురుగుమందులు, ఎరువులు సరఫరా చేసే వినుకొండలో పురుగు మందుల వ్యాపారులు కొందరు అనుమతి లేని బయో ఉత్పత్తులు రైతులకు అంటగడుతున్నారు. మిర్చి, పత్తి పంటలకు ఎక్కువగా వాడే పురుగుమందుల పేర్లలో కొన్ని అక్షరాలు మార్చి అదే పేరుతో అమ్మకాలు సాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాలకే పరిమితం కాకుండా గుంటూరు జిల్లాకు కూడా రవాణా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి లేని బయో ఉత్పత్తులు విక్రయిస్తుంటే కట్టడి చేసి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా చూడాల్సిన వ్యవసాయ



శాఖలో కొందరి పరిస్థితి మీరేమైనా అమ్ముకోండి... మాకు మామూళ్లు ముట్టజెప్పండి అన్నట్లు తయారైంది. అనుమతి లేని బయో మందులు కూడా వ్యాపారి బిల్లులో నమోదు చేసి విక్రయించడమే ఇందుకు నిదర్శనం. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు హడావుడి చేయడం మినహా నిర్మాణాత్మక చర్యలు లేవు. వినుకొండలో ఎరువులు అధికధరకు అమ్ముతున్నారని ఆధారాలతో సహా రైతు ఫిర్యాదు చేస్తే అప్పుడు వ్యవసాయశాఖ యంత్రాంగం కదిలింది. గుంటూరు నుంచి నిఘా విభాగం బృందం వెళ్లి గడువు మీరిన మందులు అమ్ముతున్నారని గుర్తిస్తే కేసు నమోదు చేశారు. బయోలు ఎక్కడ తయారు చేస్తున్నారు? ఏయే ఉత్పత్తులు తయారవుతున్నాయి? ఎక్కడ మార్కెట్ చేస్తున్నారన్న వివరాలన్నీ వ్యవసాయశాఖ వద్ద ఉన్నా వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు.

అనతికాలంలో అధికాదాయం

వినుకొండ కేంద్రంగా తయారవుతున్న బయో ఉత్పత్తులు ప్రముఖ కంపెనీ పురుగు మందులను పోలిన పేర్లతో విక్రయాలు చేస్తుండటంతో డిమాండ్ పెరిగింది. పల్నాడు, ప్రకాశంతోపాటు గుంటూరు జిల్లాకు విస్తరించాయి. గుంటూరు నగరానికి తెలంగాణ ప్రాంతం నుంచి కూడా రైతులు వచ్చి పురుగుమందులు కొనుగోలు చేస్తుంటారు. ఈక్రమంలో వినుకొండలో ప్రముఖ పురుగుమందులను పోలిన బయో ఉత్పత్తులు లభిస్తున్నాయని తెలిసి వాటిని కొనుగోలు చేస్తున్నారు. వినుకొండ కేంద్రంగా ఉన్న బయో ఉత్పత్తుల కేంద్రాలు కొన్నింటికి అనుమతులు తీసుకుని వాటి మాటున అనుమతిలేని ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. పెట్టుబడి, తయారీ ఖర్చు తక్కువగా ఉండటంతో స్వల్పకాలంలోనే అధికాదాయాన్ని పొందుతున్నారు. పురుగుమందుల కంటే బయో ఉత్పత్తులతో లాభాలు ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటిని అమ్మటానికే మొగ్గుచూపుతున్నారు. ఈవ్యవహారం వ్యవసాయశాఖలో కొందరికి తెలిసినా మామూళ్ల మాటున మిన్నకుండిపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారి ఒకరు, జిల్లా కేంద్రంలో పనిచేసే అధికారి ఒకరు వ్యాపారులకు అన్నివిధాలా సహకారం అందిస్తున్నారు.

పర్యావరణానికి విఘాతం

అనుమతి లేని బయో ఉత్పత్తులు వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. బయోల్లో మొక్కలు, సముద్రగడ్డి నుంచి తీసిన జీవసంబంధ పదార్థాలు మాత్రమే వాడాలి. అనుమతి లేని బయో ఉత్పత్తుల్లో ఎక్కువగా పురుగుమందులు కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పురుగుమందులు నిపుణుల పర్యవేక్షణలో తయారు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగశాలలో పరీక్షించి నిర్ణీత మోతాదులో రసాయనాలు ఉన్నవాటినే అనుమతిస్తారు. బహుళజాతి సంస్థలు కావడంతో ప్రతిదశలోనూ నాణ్యతను తనిఖీ చేసుకుని మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. బయో ఉత్పత్తులు తయారుచేసే వారిపై పర్యవేక్షణ లేకపోవడం, పరిమితికి మించి రసాయనాలు కలిపి విక్రయించడంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ నిర్దిష్టమైన చర్యలు తీసుకుని రైతులకు నాణ్యమైన మందులు అందేలా చూడాల్సి ఉంది.

8లో
ఉపాధికి ఊతంగా పొగనారుమళ్లు
కందిలో వెర్రి తెగులు.. నివారణ చర్యలు
రైతేరాజు

ప్రేమోన్మాది కిరాతకం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రేమించను అన్న పాపానికి బాలిక ఇంటికెళ్లి ఆమెతో పాటు తల్లిదండ్రులపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడో కిరాతకుడు. చెరుకుపల్లి మండలంలోని ఓ గ్రామంలో బాలిక కుటుంబంపై జరిగిన ఈ రాక్షసకాండ సంచలనం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక గతంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంది. ఆ సమయంలో మండలంలోని రాజోలు పంచాయతీ పరిధి రెడ్లపాలేనికి చెందిన కుంచాల భార్గవ్‌రెడ్డి తనను ప్రేమించాలంటూ ఆమె వెంటపడ్డాడు. విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు ఆమెను చదువు మాన్పించి, ఇంటి వద్దే ఉంచారు. కుమార్తె పెళ్లి చేయాలని కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలిసిన భార్గవ్‌రెడ్డి తనకు దక్కని బాలిక, ఇంకెవరికీ దక్కకూడదని భావించాడు. ఆదివారం అర్ధరాత్రి గ్రామానికే చెందిన ఓ బాలుడి సాయంతో బాలిక ఇంటికి వెళ్లాడు. నిద్ర లేచిన ఆమె తల్లిదండ్రులు ఎవరని ప్రశ్నించగా, అంతలోనే వెంట తెచ్చుకున్న కత్తితో వారిపై దాడి చేశారు. బాలిక తండ్రి ఛాతీ, వీపుపై కత్తితో పొడిచాడు. అడ్డొచ్చిన బాలిక, ఆమె తల్లికీ గాయాలయ్యాయి. వీరి అరుపులు విని ఇరుగుపొరుగు వారు నిద్ర లేచి పరుగెత్తుకొచ్చారు. వారి రాకను గమనించిన నిందితుడు.. బాలుడితో కలిసి పారిపోయాడు. క్షతగాత్రులను స్థానికులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

ఫోన్‌కు అందుబాటులో లేని పోలీసులు? : ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు చెరుకుపల్లి ఠాణాకు పలుమార్లు ఫోన్ చేశామని, నేరుగా ఎస్సై సెల్‌ఫోన్‌కు చేసినా ఎవరూ స్పందించలేదని గ్రామస్థులు వాపోయారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం వారు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తహసీల్దార్ పద్మావతి, రేపల్లె గ్రామీణ సీఐ సురేశ్‌బాబు అక్కడికి వచ్చి, ఆందోళనకారులతో మాట్లాడారు. 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో తగిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు రాస్తారోకోను విరమించారు.

రెండు నెలల్లో పురపాలక కార్యాలయానికి సౌరకాంతులు: మంత్రి

అద్దంకి, న్యూస్‌టుడే : వచ్చే రెండు నెలల్లో పురపాలక కార్యాలయానికి సౌరకాంతులు సమకూర్చనున్నట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సోమవారం అద్దంకి పురపాలక కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అద్దంకి పురపాలికలో నెలవారీ విద్యుత్తు బిల్లుల గురించి ప్రస్తావించగా రూ.13 లక్షల వరకు చెల్లిస్తున్నట్లు కమిషనర్ రవీంద్ర వివరించారు. మంత్రి మాట్లాడుతూ విద్యుత్తు సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలకు సౌర ఫలకలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అద్దంకి పురపాలికను కూడా ఆధునికీకరిస్తామన్నారు. వీలైనంత త్వరగా అంచనాలు తయారు చేస్తే ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తామన్నారు. మొత్తం 20 వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపడితేనే పట్టణాభివృద్ధి సాధ్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఇసుక విషయంలో చెడ్డపేరు వద్దు

ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా ఇసుక తరలింపు జరగాలన్నారు. ఈ విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎవరినీ ఉపేక్షించరాదన్నారు. ఇసుక తరలింపుపై గత, ప్రస్తుత విధానాలను బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. అద్దంకి పట్టణంలో రవాణా పెరిగినందున మినీ బైపాస్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలని సీఐ పి.కృష్ణయ్యకు సూచించారు. విద్యుత్తు నియంత్రికలు అపహరణకు గురవుతున్నాయని, రూ.2 వేల కోసం రూ.1.40 లక్షల విలువైన వాటిని ధ్వంసం చేస్తున్న వారిని నియంత్రించాలని వెల్లడించారు. తహసీల్దార్ జీ.శ్రీచరణ్, ఎంపీడీవో బి.సింగయ్య, విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు అత్తులూరి రమేష్ బాబు, మొండితోక సీతమ్మ, జాహీరా, యేజెండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలివ్వండి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను పక్కాగా ఇవ్వాలని కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్‌ను సీసీఎల్‌ఏ సంయుక్త కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశంలో కలెక్టర్, జేసీ పాల్గొన్నారు. జయలక్ష్మి మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి, చట్టాన్ని ఉల్లంఘించి చేసిన వాటి వివరాలు స్పష్టంగా పంపాలని ఆదేశించారు. ఇప్పటికే ఇచ్చిన భూముల వివరాలను పునః పరిశీలించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలు నివేదికలో పొందుపరచాలన్నారు.



సమావేశంలో కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్

శిశు మరణాలు నివారించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో శిశు మరణాలను పూర్తిగా నివారించాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గర్భిణి వివరాలు 12 వారాల్లోపు తప్పక నమోదు చేయాలన్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణిని ముందుగానే గుర్తించి పోషకాహారం తీసుకునేలా ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత కాన్పు చేయించాలని పేర్కొన్నారు. కాన్పు తర్వాత బిడ్డ ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి చెప్పాలన్నారు. పుట్టిన బిడ్డకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్ శేషుకుమార్, డీపీఎంవో రోహిణీ రత్నశ్రీ, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

మద్యం దుకాణాలకు ఊపందుకున్న దరఖాస్తులు

పట్టణాలు, మండల కేంద్రాల్లో పోటాపోటీ

న్యూస్‌టుడే, బాపట్ల, అద్దంకి, ఇంకొల్లు

మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తుల సమయంలోనే కొందరు నేతలు సిండికేట్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ముందుగా ఒప్పందానికి వచ్చి తాము చెప్పినవారు మాత్రమే దరఖాస్తు చేయాలని హుకుం జారీ చేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ఎక్కువ ఆదాయం వచ్చే కొన్ని దుకాణాలకు ఎవరూ దరఖాస్తు చేయరాదని ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. కొందరు వ్యాపారులు, మండల స్థాయి నాయకులు దీనికి ససేమిరా అంటున్నారు. ఆన్‌లైన్లో తాము దరఖాస్తులు వేసి తీరుతామని స్పష్టం చేస్తున్నారు. దీని వల్ల ఆదివారం వరకు దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ విషయం వెళ్లింది. మద్యం దుకాణాల లైసెన్స్‌ల దరఖాస్తుల విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని ఆ నేతలకు గట్టి హెచ్చరికలు వచ్చాయి. దీంతో నియోజకవర్గ నేతలు వెనక్కి తగ్గారు. రెండ్రోజుల క్రితం పలానా చోట దరఖాస్తులు వేయవద్దని చెప్పిన నేతలు మరలా వ్యాపారులకు ఫోన్లు చేసి మీ ఇష్టం వచ్చినన్ని దరఖాస్తులు వేసుకోండని చెప్పినట్లు తెలిసింది. దీంతో సోమవారం దరఖాస్తుల సంఖ్య పెరిగింది.

ఒక్కరోజే 257..

మద్యం దుకాణాల లైసెన్స్‌లు పొందటానికి ఎక్సైజ్ శాఖకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. జిల్లాలోని 117 మద్యం దుకాణాలకు సోమవారం ఒక్క రోజే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 257 దరఖాస్తులు వచ్చినట్లు ఆబ్కారీ శాఖ వర్గాలు తెలిపాయి. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల ఒకటిన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. మద్యం దుకాణాలకు రెండేళ్ల లైసెన్స్ కోసం దరఖాస్తులు ఆదివారం వరకు మందకొడిగా వచ్చాయి. మొత్తం 243 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం రాత్రికి వీటి సంఖ్య 500కు చేరుకుందని ఎక్సైజ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వ్యాపారులు సోమవారం పెద్ద సంఖ్యలో దాఖలు చేశారు. ఈ నెల 9న సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు అందజేయటానికి అవకాశం ఉంది.



అద్దంకి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఔత్సాహికులు

❖ మద్యం దుకాణం లైసెన్స్ కోసం ఒక్కో దరఖాస్తుకు తిరిగి చెల్లించని(నాన్ రిఫండబుల్) రుసుం కింద రూ.2 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. దరఖాస్తుల రుసుం ద్వారా అధిక ఆదాయం అర్జించాలన్న లక్ష్యంతో ఓ వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా, ఎన్ని దరఖాస్తులైనా వేయటానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. పట్టణాలు, మండల కేంద్రాల్లో మద్యం దుకాణాల లైసెన్స్‌లు పొందటానికి వ్యాపారులు పోటీ పడుతున్నారు. చీరాల, బాపట్ల, అద్దంకి, రేపల్లె పట్టణాలతో పాటు మార్టూరు, కర్లపాలెం, పర్చూరు, చెరుకుపల్లి, నగరం, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు, వేటపాలెం, మేదరమెట్ల, ఇంకొల్లు, నగరం, ఖాజీపాలెం, వెల్లటూరు, నిజాంపట్నం, సజ్జావారిపాలెంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటానికి ఆసక్తి చూపుతున్నారు. మండలం, పట్టణం యూనిట్‌గా దుకాణాలు ఏర్పాటు చేయటానికి ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. పట్టణాల్లోని ఒక్కో దుకాణానికి ఆరు నుంచి పది వరకు దరఖాస్తులు వస్తున్నాయి. చివరి రెండ్రోజుల్లో దరఖాస్తుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఆబ్కారీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆసక్తి..

గతంలో మద్యం వ్యాపారం చేసిన వ్యాపారులతో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఇతర వర్గాలు మద్యం దుకాణాల లైసెన్స్‌లు పొందటం కోసం ఆసక్తి చూపుతున్నారు. అద్దంకి పట్టణంలోని ఐదు దుకాణాలు ఉండగా ఒక్కో దుకాణానికి లైసెన్స్ ఫీజుగా రూ.55 లక్షలుగా నిర్ణయించారు. అదే బాపట్ల, చీరాల, రేపల్లె పట్టణాల్లో లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా ఉంది. ఈ నేపథ్యంలో అద్దంకిలో మద్యం దుకాణాల లైసెన్స్ దక్కించుకోవటానికి ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. నలుగురైదుగురు కలిసి సిండికేట్‌గా ఏర్పడి రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలు ఖర్చు చేసి ఐదు నుంచి పది దుకాణాలకు మూడు నుంచి నాలుగు చొప్పున దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. ఏడాది లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా ఉన్న మండలాల్లో కొన్ని దుకాణాలకు దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయి.

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక రూపకల్పనపై సమావేశం నేడు

బాపట్ల: స్వర్ణాంధ్ర-2047 విజన్ బాపట్ల ప్రణాళికల రూపకల్పనపై ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్ కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రగతి నివేదిక ఆవిష్కరణ, ప్రణాళికల తుది రూపకల్పనపై సమగ్రంగా చర్చించనున్నారు. జిల్లా అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు, ప్రైవేటు భాగస్వామ్యం, మౌలిక వసతుల కల్పన, పేదల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళల ఆర్థిక స్వావలంబన, ఆక్వా రంగం, రైతులకు లాభసాటి వ్యవసాయం తదితరాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

డ్వాక్రా రుణాల రద్దుకు డిమాండ్

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : వరద ప్రభావిత లంక గ్రామాల్లో నష్టపోయిన డ్వాక్రా గ్రూపుల మహిళలకు సంబంధించిన రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. లంక గ్రామాల్లో వరదలకు నష్టపోయిన డ్వాక్రా గ్రూపుల మహిళలకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. రమాదేవి మాట్లాడుతూ ఊహించని విధంగా కృష్ణానదికి వరదలు వచ్చి పంట భూములు, గృహాలను కోల్పోయారని తెలిపారు. ఇప్పటివరకు వరద దెబ్బకి కోలుకోలేదని, బ్యాంకులకు రుణాలు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం రుణాలను మాఫీ చేస్తే మహిళలకు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పొదుపులో ఉన్న నగదును బ్యాంకు అధికారులతో మాట్లాడి గ్రూపు సభ్యులకు ఇప్పించాలని కోరారు. నీట మునిగిన గృహాలకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు టి.కృష్ణమోహన్, వేములపల్లి వెంకట్రామయ్య, జి.సుధాకర్ తదితరులున్నారు.

ప్రేమోన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్లకార్డులు పట్టి నినాదాలు చేస్తున్న రమాదేవి తదితరులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: చెరుకుపల్లి మండలంలో ఓ బాలిక, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ప్రేమోన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలిక, ఆమె తల్లిదండ్రులను సోమవారం పరామర్శించి మాట్లాడారు. బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఆమె ఇంటికెళ్లి మారణాయుధాలతో దాడి చేయడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వ పాలనలో బాలికలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. కొత్త ప్రభుత్వం వచ్చినా రాష్ట్రంలో బాలికలకు, మహిళలకు రక్షణ లేదనడానికి ఈ ఘటన తార్కాణమన్నారు. గతంలో పదోతరగతి విద్యార్థి అమర్నాథ్ హత్య కేసును పోలీసులు నీరుగార్చారని ఆరోపించారు. ఈ కేసునూ అలాగే చేస్తారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు. 24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలని విచారణలో జాప్యం చేయకుండా మూడు నెలల్లో శిక్షించాలన్నారు. సీపీఎం నేతలు చిక్కాల మణిలాల్, వేమూలపల్లి వెంకటరామయ్య, కిశోర్, దర్శరాజు, లక్ష్మణ్, రమేష్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

చి'వరి'కి అందని నీరు



ఎండిన వరిపైరు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండలంలో శివారు పొలాలకు నీరందక వరి పంట ఎండిపోతోంది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలతో కొట్టుమిట్టాడుతూ వర్షాలు.. ఎండలను లెక్క చేయక అనేక వ్యయ ప్రయాసలకోర్చి రైతులు ఈ ఏడాది వరినాట్లు వేశారు. ఆయకట్టు పరిధిలో మాగాణి, మెట్ట ప్రాంతాలకు సాగు నీరందటంతో పొలాలు పచ్చగా ఉన్నాయి. మరోవైపు న్యూ ముత్తాయపాలెం ఛానల్ కింద పడమర పిన్నిబోయినవారిపాలెం పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పొలాలకు నీరందక కొన్ని పొలాల్లో పైరు ఎరుపు రంగులో మారి వడలి కోత కోసినట్లు కనిపిస్తోంది. మెట్ట భూములు కావటం, మరోవైపు జాతీయ రహదారి నిర్మాణ సమయంలో పంట కాలువలను సరైన క్రమంలో అనుసంధానం చేయకపోవటంతో పైరుకు నీరు అందటం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు చేపట్టిన రైతులు ప్రస్తుతం వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో పంటలు వాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ.20వేల వరకు ఖర్చు చేసి పంటలు వేశామని, ప్రస్తుతం చివరి పొలాలకు అందేలా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

బాపట్లలో గవర్నర్‌కు స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్

బాపట్ల, న్యూస్‌టుడే: రెండ్రోజుల వ్యక్తిగత పర్యటన నిమిత్తం మండల పరిధిలోని కొత్త ఓడరేవులో ఓ ప్రైవేటు రిసార్ట్స్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం వచ్చారు. రిసార్ట్స్ వద్ద పోలీసు సిబ్బంది నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకట మురళి, ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్, జేసీ ప్రఖర్ జైన్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వ్యక్తిగత సెలవులో ఎస్పీ తుషార్ డూడీ

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఈ నెల 4 నుంచి నాలుగు రోజుల వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా ప్రకాశం ఎస్పీ దామోదర్‌ను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియమించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ బాపట్ల పర్యటన బందోబస్తు ఏర్పాట్లను ఇన్‌ఛార్జి ఎస్పీ పర్యవేక్షించారు.

రైతుబజారు ప్రారంభించాలని వినతి



బీఎస్పీ నేత కోటేశ్వరరావు నుంచి అర్జీ తీసుకుంటున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో రైతుబజారును ప్రారంభించి రైతులకు దుకాణాలు కేటాయించాలని కలెక్టర్ వెంకట మురళిని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు కోరారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుబజారు నిర్మించి ఐదున్నరేళ్లు అవుతున్నా ఇంకా ప్రారంభించలేదన్నారు. రైతులు ఆరు బయట రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో రైతుబజారు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

★ మండల పరిధిలోని భర్తిపూడిలో అక్రమ లేఔట్లు వేసి స్థలాలు విక్రయిస్తున్నారని వీటికి స్థానిక గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేదని కలెక్టర్‌కు సర్పంచి ఆచంట అమరేష్ ఫిర్యాదు చేశారు. సర్పంచి మాట్లాడుతూ అక్రమ లేఔట్లలో స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని కోరారు.

★ వెదుళ్లపల్లి కొత్తపాలెంలో తనకు చెందిన 67 సెంట్ల వ్యవసాయ భూమిని గత తహసీల్దారు సుధారాణి ఆన్‌లైన్ నుంచి అక్రమంగా తొలగించారని గ్రామానికి చెందిన రైతు మంచాల శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తిరిగి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. సమాచార కమిషనర్ ఆదేశాలను తహసీల్దారు పాటించలేదని తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం మొత్తం 150 అర్జీలు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో 21 అర్జీలు గడువు దాటినా పరిష్కరించలేదన్నారు. అర్జీలు పునరావృతమైతే అధికారులు సరిగా పని చేయటం లేదని భావించాల్సి వస్తుందన్నారు. జేసీ ప్రఖర్‌జైన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోరూ!



చెరుకుపల్లి: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

భట్టిప్రోలు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మగ్గాల గుంతల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర సహాయక కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ వర్షాలు కారణంగా కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మంగళగిరిలో అందించినట్లు ఆర్థిక సహాయం, నిత్యావసర సరకులను వెంటనే అందించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, నాయకులు దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు, దీపాల సాంబశివరావు, నాగభూషణం పాల్గొన్నారు. చెరుకుపల్లిలోనూ తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందించారు.

జ్వర గ్రామాల్లో మూడో రోజు వైద్య శిబిరం

28 మందికి వైద్య పరీక్షలు



రోగికి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ విజయభాస్కరరావు

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: పెదగంజాం పంచాయతీ పరిధిలోని అవులదొడ్డి కొత్తగొల్లపాలెం, అవులదొడ్డి పాతగొల్లపాలెం గ్రామాల్లో మూడో రోజైన సోమవారం ఇంటింటికి 14 మంది వైద్య సిబ్బంది పంపి సర్వే చేయించినట్లు చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారి బాధలను వివరిస్తూ 'ఈనాడు'లో 'జ్వరంతో మంచమెక్కిన పల్లెలు' శీర్షికతో ఈ నెల 6న కథనం ప్రచురితమైంది. స్పందించిన వైద్య అధికారులు ఆది, సోమవారాల్లో వైద్య శిబిరం నిర్వహించి 43 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు డాక్టర్ తెలిపారు. వారికి డెంగీ, మలేరియా జ్వరాలు లేవని తెలిపారు. అనంతరం గ్రామాల్లో బ్లీచింగ్ చేయించారు.

ట్రాక్టర్ ఢీకొని తల్లీకుమారుడికి గాయాలు

కర్లపాలెం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుండివారిపాలెం పంచాయతీ బిడారుదిబ్బకు చెందిన తల్లీ, కుమారుడు కుంచాల కటాక్షమ్మ, చెంచయ్య ద్విచక్రవాహనంపై పిట్టలవానిపాలెం వైపు వెళ్తుండగా దమ్మన్నవారిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఇద్దరికీ గాయాలవ్వగా బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడల్లో బాపట్ల జిల్లాకు పతకాలు



ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న లావణ్య

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 4, 5, 6 తేదీల్లో గుంటూరులోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన పలు పోటీల్లో బాపట్ల జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరిగాయి. క్యారమ్స్ డబుల్స్‌లో అట్లూరి ప్రశాంత్ (ఎస్‌జీటీ, మార్టూరు), చందోలు జిలానీ (ఎస్‌జీటీ, సంతమాగులూరు) ప్రథమస్థానం సాధించారు. షాట్‌పుట్ 45 సంవత్సరాల విభాగంలో తాతా సుబ్బారావు (ఎస్‌జీటీ, చెరుకుపల్లి) ప్రథమ, జావెలిన్‌త్రోలో ఆసాది లావణ్య (వ్యాయామ ఉపాధ్యాయిని, మైలవరం జడ్పీహెచ్‌ఎస్) ద్వితీయ, 45 సంవత్సరాల నడక పోటీలో కె. నిరీక్షణరావు (ప్రధానోపాధ్యాయుడు, అమృతలూరు జడ్పీహెచ్‌ఎస్) ద్వితీయ, జావెలిన్ త్రోలో కె.జాకబ్ (మార్టూరు) తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు బహుమతులు అందచేశారు. స్వర్ణోత్సవ వేడుకలు డిసెంబరులో కాకినాడలో నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులకు జిల్లా శాఖ తరపున అభినందనలు తెలిపారు.



వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన ఉపాధ్యాయులు

పాల వాహనం అదుపు తప్పి బోల్తా



ప్రమాద దృశ్యం

నిజాంపట్నం, న్యూస్‌టుడే : పాలు తరలిస్తున్న వాహనం అతివేగంగా ప్రయాణిస్తూ అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన ఘటన నిజాంపట్నంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. నిజాంపట్నం నుంచి పాలను తరలిస్తున్న వాహనం నిజాంపట్నం ఊరు దాటగానే అతివేగంగా ప్రయాణిస్తూ తిరగబడి ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగుల చినమీరయ్య నడుముకు తీవ్ర గాయం కావడంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తెనాలి తరలించారు. కొమరవోలు రొయ్యల కంపెనీలో పని కోసం పాల వాహనంలో వెళుతున్న దర్వేష్‌పాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే నూరాకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక వైద్యశాల్లో చికిత్స అందించారు. బాధితులను జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త, అత్త మామ వేధిస్తున్నారని వేటపాలెం మండలం కొత్తపాలేనికి చెందిన మహిళ పిట్టు కావ్యశ్రీ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అదనపు ఎస్పీ విఠలేశ్వర్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె మాట్లాడుతూ గత ఆగస్టు 23న చీరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో స్వర్ణ రోడ్‌కు చెందిన పిట్టు శివనాగబాబుతో తన వివాహం జరిగిందని తెలిపింది. వివాహ సమయంలో కట్నంగా రూ.5లక్షల నగదు, నాలుగున్నర సవర్ల బంగారు ఆభరణాలను తన తల్లిదండ్రులు ఇచ్చారని పేర్కొంది. 16 రోజుల పండగ ముగియగానే అదనపు కట్నం కింద మరో రూ.లక్ష తీసుకు రావాలని భర్త శివనాగబాబు, అత్తామామలు పిట్టు శివపార్వతి, శ్రీనివాసరావు కలిసి వేధిస్తున్నారని ఆరోపించింది. దీనిని ప్రశ్నించిన తన తండ్రిపై దాడికి పాల్పడ్డారని చెప్పింది. చీరాల రెండో పోలీస్‌స్టేషన్లో నిందితులపై ఫిర్యాదు చేశానని, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని వేడుకుంది.

గల్లంతైన యువకుడు శవమై తేలాడు

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో చిలుమూరు సమీపంలోని కృష్ణానదిలో తన ఆరుగురు మిత్రులతో కలిసి ఆదివారం సరదాగా ఈతకు వచ్చి ప్రమాదవశాత్తు ప్రవాహంలో కొట్టుకు పోయిన తెనాలి బీసీ కాలనీకి చెందిన బొడ్డపాటి నరేష్ (20) గాజుల్లంక వద్ద సోమవారం శవమై తేలాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పరీక్షల నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వెలగపూడి హర్ష (35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నీటి మోటారుకు సంబంధించి విద్యుత్తు బోర్డులో స్విచ్ వేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్తు తీగ ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఓ కుమారుడు ఉన్నాడు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 88/-.

గుంటూరులో పీఎంజే జ్యువెల్స్ స్టోర్ ప్రారంభం



జ్యోతి వెలిగించి అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, పీఎంజే జ్యువెల్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలి, క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్‌కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్‌కృష్ణ చైతన్య తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పీఎంజే జ్యువెల్స్ గుంటూరులో ఏర్పాటు చేసిన కొత్త ఔట్‌లెట్‌ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కొత్త షోరూం ఆభరణాల ప్రియులను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. పీఎంజే జ్యువెల్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలి మాట్లాడుతూ గుంటూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఆభరణాల ప్రియులు కొత్త స్టోర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన సరికొత్త డిజైన్‌లను కచ్చితంగా ఇష్టపడతారన్నారు. వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని వజ్రాలు, బంగారం, విలువైన రాళ్లతో విస్తృతమైన డిజైన్ల ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. వివాహ వేడుకలకు సంబంధించిన ఆభరణాలు, కార్యాలయం, పార్టీవేర్, సాధారణ రోజువారీ దుస్తులకు అనువైన తేలికపాటి క్రియేషన్‌లు, అద్భుత ఆభరణాల సేకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్‌కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్‌కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో బాలుడి దుర్మరణం

చినగంజాం: ఆటో ప్రమాదంలో ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఎస్సై శీలం రమేష్ వివరాల మేరకు.. తిరుపతి జిల్లా, బాలయ్యపల్లె మండలం, జయంపు గ్రామానికి చెందిన నవూరు వెంకటేష్ కొంతకాలంగా చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో నివసిస్తున్నారు. రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అట్ల మురళీరెడ్డి వెంకటేష్‌కు స్నేహితుడు. సోమవారం ఉదయం వెంకటేష్ కుమారుడు శ్యామ్‌జీవన్ (7) రాజుబంగారుపాలెంలోని మురళీరెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. మురళీరెడ్డి తన ఆటో స్టార్ట్ చేసి, న్యూట్రల్‌లో ఉంచి ఇంటిలోకి వెళ్లాడు. అదే సమయంలో శ్యామ్‌జీవన్ ఆటో ఎక్కాడు. తన చేయి గేర్‌కు తగిలి ఆటో కదిలింది. ఆటో కదలడంతో భయపడిన శ్యామ్‌జీవన్ ఒక్కసారిగా దూకటంతో ఆటోకు సిమెంటు గోడకు మధ్యలో పడిపోవడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బాలుడు మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుకు కూలీ...

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: బాపట్లకు చెందిన సుందరరావు (50) పోలం పనుల నిమిత్తం తోటి కూలీలతో కలిసి సోమవారం చీరాల- స్వర్ణ రోడ్డు ప్రాంతంలో పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో పాము కాటుకు గురి కావడంతో వెంటనే అతడిని చీరాల వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జిల్లా స్థాయి ఇసుక కమిటీ, బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఇసుక రీచ్ నందు మాన్యువల్ త్రవ్వకం, లోడింగ్, నిల్వ కేంద్రం వద్దకు రవాణా మరియు నిల్వ కేంద్రం వద్ద వాహనాలలో లోడ్ చేయుట కొరకు సీల్డ్ టెండర్ కోరుతూ ప్రకటన

నోటిఫికేషన్ సంఖ్య 4630/DLSC-SAND/BPTL/2022, తేదీ: 07-10-2024

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా, సుమారు 6 నెలల కాల వ్యవధి కొరకు దిగువ షెడ్యూల్‌లో పేర్కొనబడిన వనరులలో ఇసుక మాన్యువల్ త్రవ్వకం, లోడింగ్, నిల్వ కేంద్రం వద్దకు రవాణా మరియు నిల్వ కేంద్రం వద్ద వాహనాలలో లోడ్ చేయుట కొరకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. సీల్డ్ టెండర్లు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో 10-10-2024 తేదిన సాయంత్రం 05-00PM వరకు స్వీకరించబడును.

షెడ్యూల్

క్రమ సంఖ్య	ఇసుక రీచ్ పేరు	మండలం	విస్తీర్ణం హెక్టారులలో	పరిమాణం మెట్రిక్ టన్నుల్లో	జియో-కోఆర్డినేట్స్	కాల పరిమితి వరకు
1	గాజులలంక	కొల్లూరు	4.950	74249	16.179142°N 80.833160°E 16.178641°N 80.834693°E 16.177037°N 80.835180°E 16.176446°N 80.834278°E 16.177571°N 80.832726°E	6 నెలలు
2	జువ్వలపాలెం	కొల్లూరు	4.960	74400	16.133944°N 80.853494°E 16.134220°N 80.854696°E 16.130961°N 80.855550°E 16.130665°N 80.854336°E	6 నెలలు

సం/- జె.వి.మురళి I.A.S., కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ మరియు ఛైర్మన్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ, బాపట్ల జిల్లా

గమనిక: వేలం నియమ నిబంధనలు, దరఖాస్తు నమూనాలు మొదలగు మరియు అనుబంధములను ఈ కార్యాలయము నుంచి దరఖాస్తు, ఒక రీచ్‌కి రూ.10,000/- చొప్పున SAND ACCOUNT BAPATLA DISTRICT, 2024 వారి పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి పొందవచ్చును.

బాపట్ల
•బాపట్ల • రేపల్లె • వేమూరు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా పలువురు నేతలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తెదేపా బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గోగినేని వసుధ మండలంలోని నడింపల్లిలో వేంచేసిన గోగినేని వారి ఇలవేల్పు శ్రీరెడ్డంకమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విపత్తుల నుంచి, రాష్ట్రానికి సంకటంగా మారిన సైకో జగన్ నుంచి ప్రజలను, రాజధాని అమరావతి, రాష్ట్రాన్ని కాపాడే శక్తిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రసాదించాలని ఆమె అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన నిర్వహించారు. నేతలు గోగినేని రామాంజనేయులు, కొడాలి తల్పసాయి, రామ్మోహనరావు, గవిని కృష్ణ, గోగినేని సురేష్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు ముత్తాయపాలెంలో 'పొలం పిలుస్తోంది'

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించటమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని ముత్తాయపాలెం, అడవి-2 గ్రామ పంచాయతీల్లోని రైతుభరోసా కేంద్రాల పరిధిలో మంగళవారం ఏర్పాటయ్యే కార్యక్రమాల్లో చీడపీడ నివారణలు, పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? మండల కేంద్రంలోని దర్వేష్‌పాలెం వెళ్లే మార్గంలో మురుగు కాల్వ వంతెన పక్కన ముళ్ల మొక్కలు పెరిగాయి. వాటి వల్ల ప్రయాణం ఇబ్బందిగా ఉంది. పెరిగిన ముళ్ల మొక్కలు తొలగించాలి. సమస్య లేకుండా చూడాలి.

- స్థానికుడు, నిజాంపట్నం.

✔ కొత్తగా బాధ్యతలు చేపట్టా. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తా. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తా.

- శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి, నిజాంపట్నం

- న్యూస్‌టుడే, నిజాంపట్నం

? పోతుమర్రులో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించారు. కానీ కాల్వల్లో చేరిన చెత్తను తొలగించడం లేదు. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. సమస్య అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

- స్థానికుడు, పోతుమర్రు

✔ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వలో చెత్త తొలగిస్తాం. **- గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, వేమూరు

ఉపాధి పనులు ప్రారంభించాలి

కొల్లూరు, న్యూస్‌టుడే: ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదల వల్ల పొలాలు ముంపునకు గురికావడంతో లంక గ్రామాల్లో కూలి పనులు లేకుండా పోయాయని దీంతో వ్యవసాయ కూలీలకు పూట గడవడం కష్టంగా మారిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎస్ఆర్ విద్యాసంస్థల సహకారంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పోతార్లంకలోని వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి లంక గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రైవేటు రుణ సంస్థల నుంచి లంక గ్రామాల్లోని పేదలు తీసుకున్న రుణాల చెల్లింపునకు కనీసం మూడు నెలలు వెసులుబాటు కల్పించాలని కోరారు. అనంతరం ఆమె వరద బాధితులకు సుమారు రూ.2 లక్షల విలువైన బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ గోగినేని సాంబశివరావు, సీపీఎం నాయకులు కృష్ణమోహన్, వేములపల్లి వెంకట్రామయ్య, నాగమల్లి, సుబ్బారావు, పోతార్లంక సర్పంచి పరిశా రంగారావు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ.. మండలంలోని దోనేపూడి పంచాయతీ శివారు కొత్తగూడెంలో 104 మంది వరద బాధితులకు సీపీఎం నాయకులు తోడేటి సురేష్, పంతగాని నాగమల్లేశ్వరరావు చొరవతో చుండూరు మండలం వలివేరుకు చెందిన దాతలు రెడ్డియ్య, చింపిరియ్య, సుధీర్, ఎనోష్, ప్రసాద్ దోమతెరలు పంపిణీ చేశారు.

భూ సమస్యలపైనే అర్జీలు అధికం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు వచ్చినట్లు సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 30 జిల్లాల ప్రణాళికలో రేపల్లె రెవెన్యూ డివిజన్‌ను తెనాలి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహనరావు, రేపల్లె మండలం ఉప్పూడిలో తమ ఇంటి స్థలం, ఇంటికెళ్లే మార్గం ఆక్రమించుకున్నారని, నిజాంపట్నం మండలం అడవులదీవిలో తమ పొలాన్ని ఆన్‌లైన్లో నమోదు చేయాలని, చుండూరు మండలం ఆలపాడులో ఉన్న తమ భూమిని ఆన్‌లైన్ చేయించాలని, కొల్లూరు మండలం పోతార్లంక గ్రామంలో తమ పొలాన్ని ఆన్‌లైన్ చేయించాలని అర్జీ అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖలకు అర్జీలు పంపినట్లు ప్రసాద్ తెలిపారు. చెరుకుపల్లి: మండలంలో 2 అర్జీలు అందినట్లు తహసీల్దార్ సీహెచ్ పద్మావతి తెలిపారు.


అమృతలూరులో గాయత్రి దేవి అలంకరణ


వేమూరు: చావలిలో అన్నపూర్ణ


వేమూరు: వలివేరులో..


బాపట్ల: మూలపాలెం ఎన్టీఆర్ కాలనీలో కనకదుర్గమ్మ


బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారం శివాలయంలో పార్వతీ అమ్మవారు


చెరుకుపల్లి: కావూరులో మహాచండిగా..


పి.వి.పాలెం: రాజశ్యామలగా చందోలు బండ్లమ్మ


రేపల్లె రైలుపేటలో లలితాత్రిపురసుందరీదేవి


రేపల్లె: బూరుగలమ్మ గుడిలో శ్రీమహాలక్ష్మిదేవి


రేపల్లె: శ్రీవైష్ణవిగా వాసవికన్యకాపరమేశ్వరి..


రేపల్లె: ఇసుకపల్లిలో కాళికాదేవి


రేపల్లె: పేటేరులో మంగళగౌరీ


బాపట్ల: భావనారాయణస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిగా..


బాపట్ల: వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహాపరమేశ్వరిగా


నందిరాజుతోట శివాలయంలో చిన్నారులకు దేవతామూర్తుల వేషధారణలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నిజాంపట్నం యాదవపాలెం రామ మందిరంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద దంపతుల పూజలు

మహా చండీ.. మము కావుమా

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అయిదో రోజుకు చేరాయి. అమ్మవారు మహా చండీ దేవిగా, సంతాన, ధైర్య లక్ష్మిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు. మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈనెల 10న చెరుకుపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన జరుగుతుందని ఈవో తెలిపారు. **- న్యూస్‌టుడేబృందం**


బాపట్ల: గాయత్రిదేవి అలంకారంలో..


కొల్లూరులో పార్వతి దేవి


బాపట్ల: అగ్రహారం అలయంలో చాముండేశ్వరీదేవిగా


బాపట్ల: పోలేరమ్మ ఆలయంలో మహా చండీదేవిగా


బాపట్ల: బ్రాహ్మణ సమాఖ్య మండపంలో సంతానలక్ష్మిగా


నగరంలో..


బాపట్ల: టౌన్‌హాలు మండపంలో..


బాపట్ల: పాండురంగస్వామి ఆలయంలో..


బాపట్ల: రామాలయంలో మహా చండీదేవిగా

తొలి ప్రసాదం అందుకోవడం ఆనవాయితీ

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలో గుళ్లపల్లి శ్రీఆనందీశ్వరస్వామి ఆలయం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీఅన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నివేదించిన ప్రసాదాన్ని ముస్లిం మహిళలకు ఆలయ ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ అందించారు. ఏటా దసరా నవరాత్రుల సమయంలో మూడ్రోజుల పాటు ముస్లిం మహిళలు అమ్మవారిని దర్శించడం ఇక్కడ ఆనవాయితీ. ఆ రోజుల్లో వారే తొలి ప్రసాదం అందుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు.


ముస్లిం మహిళకు ప్రసాదం అందిస్తున్న సత్యనారాయణ తదితరులు

అలరించిన కూచిపూడి నృత్యం

కొల్లూరు, న్యూస్‌టుడే: స్థానికంగా శ్రీ పార్వతీ అమ్మవారు దేవస్థానం నుంచి సోమవారం ప్రత్యేక అలంకరణలో రథంపై బయలు దేరి పురవీధుల్లో దర్శనం ఇవ్వడంతో భక్తులు పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా లాస్య కూచిపూడి నృత్యాలయ తెనాలి కళాకారుల కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది.




కర్లపాలెం: బోలాయపాలెంలో మహాచండికాదేవి

నిధుల వినియోగంపై అవగాహన అవసరం

చుండూరు, చెరుకుపల్లి, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పంచాయతీలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలు, పంచాయతీలకు మంజూరయ్యే నిధుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని చుండూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుధారాణి తెలిపారు. మండల పరిధిలోని వార్డు సభ్యులకు, ఉప సర్పంచులకు చుండూరు మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖ విధి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జె. రూబెన్ తదితరులు పాల్గొన్నారు. చెరుకుపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసన్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ గ్రామ కార్యదర్శి ఈపూరి విజయబాబు పంచాయతీరాజ్ చట్టంపై సభ్యులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు ఏయే నిధులు సమకూరుతాయి, వాటి వినియోగం ఎలా చేయాలి, గ్రామంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. రేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. శిక్షకుడు దాసరి శ్రీనివాసరావు పంచాయతీ ఉప సర్పంచి, వార్డు సభ్యుల హక్కులు, విధులు, బాధ్యతలు వివరించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, ఇసుకపల్లి, బొందలగరువు, బేతపూడి, చాట్రగడ్డ, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, గుడ్డికాయలంక, కారుమూరు, కామరాజుగడ్డనార్త్, సౌత్ తదితర పంచాయతీల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణానికి ఎన్ని ఇక్కట్లో!

పిట్టలవానిపాలెం, నిజాంపట్నం, న్యూస్‌టుడే : నిజాంపట్నం మండలం పల్లపట్ల పంచాయతీ చింకపాలెం గ్రామంలో ప్రయాణికుల ప్రాంగణం పిచ్చి మొక్కలు మొలచి కూర్చోవడానికి కాదు కదా కనీసం నిలబడేందుకు కూడా అనుకూలంగా లేదు. పల్లపట్ల పంచాయతీ చింకపాలెం, ముదిరాజుపాలెం, లింగినేనివారిపాలెం, నగరం మండలం అల్లపర్రు గ్రామాల ప్రజలు రేపల్లె, నిజాంపట్నం ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడకు వచ్చి బస్సులు లేదా ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంది. ప్రతి రోజూ ఆయా గ్రామాల నుంచి సుమారు 200 నుంచి 300 మంది ప్రయాణాలు చేస్తారు. చింకపాలెంలో ప్రయాణికులు నిలిచే ప్రాంగణంలో పిచ్చి


నిజాంపట్నం: నిలబడేందుకు కూడా అనువుగా లేక..

మొక్కలు పెరిగి అనుకూలంగా లేకపోవడంతో వారు ఎండ, వానలకు ఇక్కట్లు పడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. పంచాయతీ పాలకులు, లేక అధికారులు స్పందించి ప్రాంగణాన్ని శుభ్రం చేసి తమ వెతలు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రుక్మిణి వద్ద ప్రస్తావించగా సమస్య తమ దృష్టికి రాలేదని పాలక వర్గంతో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు. వారికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. పిట్టలవానిపాలెం బస్సు ప్రాంగణం ముందు ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి బురదమయం కావటంతో వాహనదారులు, ప్రయాణికులు బస్సు ప్రాంగణంలోకి వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి శివకుమార్‌ను సంప్రదించగా గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే మట్టి వేసి గుంతలు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.


పి.వి.పాలెం: బస్సు ప్రాంగణం ముందు గుంతలు

పేదల పక్షపాతి శంకరన్

బాపట్ల, న్యూస్‌టుడే: విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ పేదల పక్షపాతిగా పని చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శంకరన్ వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్లో ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి సోమవారం నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాయతీగా పని చేసి ఎంచుకున్న లక్ష్యాలు చేరుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రీతిశ్రీ, కావ్యకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. జేసీ ప్రఖర్ జైన్, ఆర్డీవో గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, ఫోరం కార్యదర్శి సాయిబాబు పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపై వదలొద్దు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఆవులను రోడ్లపైకి వదలకుండా ఇంటి వద్దనే ఉంచుకునేలా యజమానులు చర్యలు తీసుకోవాలని రేపల్లె మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు సూచించారు. ఆవులు రహదారులపై సంచరించడం వల్ల ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రోడ్లపై తిరిగే ఆవులను బుధవారం గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. గోశాలకు తరలించిన ఆవులు మళ్లీ తిరిగి రావని యజమానులు గ్రహించి అధికారులకు సహకరించాలని కోరారు.

మండల పంచాయతీ విస్తరణాధికారిగా రవిశంకర్

నిజాంపట్నం, న్యూస్‌టుడే : నిజాంపట్నం మండల పంచాయతీ విస్తరణాధికారిగా ఎం.రవిశంకర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సునీత డిప్యుటేషన్‌పై చెరుకుపల్లి వెళ్లారు. నెల్లూరు జిల్లాలో

అపీ ఇవీ

పనిచేస్తున్న రవిశంకర్ సాధారణ బదిలీల్లో భాగంగా నిజాంపట్నం వచ్చారు. మండలంలో పంచాయతీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయనను పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపల్లె సీడీపీవో బాధ్యతల స్వీకరణ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె సీడీపీవోగా ఎం.సుచిత్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వేటపాలెం నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడకు బదిలీపై వచ్చారు. రేపల్లెలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మాణిక్యం ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జి సీడీపీవోగా పనిచేశారు.

వేమూరు ఎంపీడీవోగా శివనారాయణ

వేమూరు, న్యూస్‌టుడే: వేమూరు ఎంపీడీవోగా శివనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు జిల్లా తుళ్లూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీవోకు ఈవోపీఆర్డీ శేఖర్, కార్యాలయం పర్యవేక్షకురాలు అనూరాధ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శక తనిఖీ అవసరం

అమృతలూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులకు సంబంధించి తనిఖీ పారదర్శకంగా జరపాలని ఎస్ఆర్పీ వెంకటేష్ నాయక్ అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 1467 పనులపై సామాజిక తనిఖీ చేసేందుకు మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్పీలు, టీఏలు, క్షేత్రస్థాయి సహాయకులకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఏపీవో బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ డీఆర్పీల ఆధ్వర్యంలో బృందాలు ఈనెల 8 నుంచి 15 వరకు గ్రామాల్లో పర్యటించి జరిగిన పనులు, వేతనదారుల నుంచి అవసరమైన వివరణలు సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుమాంబ పాల్గొన్నారు.

తీరంలో ఓ మోస్తరు వర్షం

నగరం, న్యూస్‌టుడే: నగరం మండలంలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. శివారు రైతులు సాగు నీటి కోసం రెండు వారాలుగా ఇబ్బందులు పడుతున్నారు. మండే ఎండలకు వరి చేలు ఎండుతున్నాయి. తీరం గ్రామాల్లో తేలికపాటి వాన పడటంతో రైతులు కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: విశాఖపట్నం అర్బన్ సహకార బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని జేసీ ప్రఖర్ జైన్ అన్నారు. విశాఖపట్నం సహకార బ్యాంకు బాపట్ల శాఖను ఆయన సోమవారం ప్రారంభించారు. బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ 2025 మార్చి నాటికి తమ బ్యాంకు రూ.8 వేల కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. పాలక వర్గం, ఉద్యోగులు కలిసికట్టుగా పని చేసి సహకార బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. బ్యాంకు వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహకార బ్యాంకింగ్ రంగానికి సహాయ, సహకారాలు కావాలన్నారు. వాణి పట్టణ సహకార బ్యాంకు డైరెక్టర్ వెంకటరత్నం, సహకార బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో లక్ష్య క్రీడాకారుల సత్తా

చీరాల, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈనాడు లక్ష్య క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలలో ఒక బంగారు, 5 రజత, 3 కాంస్య పతకాలు సాధించినట్లు శిక్షకుడు పులుగు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు రాజమహేంద్రవరంలో జరిగాయి. ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన ఈ పోటీల్లో చీరాలలోని ఈనాడు లక్ష్యా సెంటర్ క్రీడాకారులు పది మంది బాపట్ల జిల్లా జట్టు తరుపున పాల్గొన్నారు. ఇందులో 16 సంవత్సరాల లోపు విభాగం లాంగ్‌జంప్‌లో వి.యశ్వంత్‌రాజ్ బంగారు పతకం సాధించగా 20 సంవత్సరాల విభాగంలో పి.మహాలక్ష్మి 200, 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో రజత పతకాలు సాధించింది. 18 ఏళ్ల విభాగంలో సుంకర శేషు వెయ్యి మీటర్ల పరుగులో కాంస్యం, మిడ్లే రిలేలో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో బి.శ్యామ్యుల్ హెప్టాత్‌లాన్‌లో కాంస్యం, వంశీ కార్తీక్ 110 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం, మిడ్లే రిలేలో రజతం, హరిశంకర్ మిడ్లే రిలేలో రజత పతకం సొంతం చేసుకున్నారు.

బాపట్ల జిల్లా రద్దు వార్తలు నమ్మొద్దు

ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా యథాప్రకారం కొనసాగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల జిల్లాను రద్దు చేస్తారని సామాజిక మాధ్యమాల్లో కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి తప్పుడు వార్తను ఖండిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 20 ఏళ్ల తర్వాత ఎన్నికల్లో తెదేపా విజయం సాధించటంతో చూసి ఓర్వలేక తమపై బురద చల్లటం కోసం జిల్లా రద్దవుతుందని, వైద్య కళాశాల తరలిపోయిందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఎవరూ నమ్మరాదన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుందాం

రానున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎన్టీయే కూటమి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం బాపట్లలో తెదేపా కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహ కూడలిలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కర్లపాలెం, పిట్టలవానిపాలెం తెదేపా కార్యాలయాల్లోనూ పట్టభద్రుల ఓటర్ల నమోదు జరుగుతుందన్నారు. [illegible] లతో వచ్చి పట్టభద్ర ఓటర్లుగా నమోదు కావాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ పట్టభద్రులు మళ్లీ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ, తెదేపా మండల అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

కౌన్సిల్ నియామకానికి దరఖాస్తులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి అర్హులైన బార్ అసోసియేషన్ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. బార్ అసోసియేషన్‌లో కనీసం ఏడేళ్ల సభ్యత్వం, 60 ఏళ్లలోపు వారు మున్సిపాల్టీ సంబంధించిన కేసుల్లో వకాల్తా తీసుకొని వాదించి ఉన్నవారు అర్హులన్నారు. దీని కోసం ప్రత్యేకంగా ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో పాటు అందజేయాలని కోరారు.

వరదబాధితులకు మహిళల సాయం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొరిశపాడు మండలం కుర్రావానిపాలెం డ్వాక్రా మహిళలు రూ.80 వేల నగదు చెక్కును మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం అందించారు. కార్యక్రమంలో గ్రామ తెదేపా నేత నాదెండ్ల కోటేశ్వరరావు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

స్పందనలో అయిదు అర్జీలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. అయిదు అర్జీలు దాఖలు అయినట్లు డీటీ సూర్యనారాయణరావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

వేటపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని దేశాయిపేట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు బదిలీపై చీరాల మండలం దేవాంగపురి వెళ్లారు. ఈపురుపాలెంలో కార్యదర్శిగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు దేశాయిపేట కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కాయిపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పూర్ణ కుమారి పాపాయిపాలెం బదిలీపై వెళ్లారు. పర్చూరు పంచాయతీలో పనిచేస్తున్న గౌస్ మహ్మద్ అక్కాయిపాలెం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

ట్రైసైకిల్ పంపిణీ

అద్దంకి, న్యూస్‌టుడే: శింగరకొండపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు దాచేపల్లి మల్లీశ్వరికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నిధులు రూ.1.40 లక్షల విలువైన మూడుచక్రాల స్కూటర్‌ను అందజేశారు. సోమవారం అద్దంకి పురపాలక కార్యాలయం వద్ద ఈ వాహనాన్ని ఆమెకు అందించారు. పట్టణానికి చెందిన గుట్టపల్లి వీరవసంతరావు రెండు రోజుల క్రితం మృతి చెందగా ఆయన చిత్రపటం వద్ద మంత్రి నివాళి అర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165169 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? ఒంగోలు రెడ్డి వీధి నుంచి ఆయిల్ మిల్లుకు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు **-శ్రీనివాసరావు**

✔ వెంటనే సిబ్బందిని పంపి బాగు చేయిస్తా **- శవనం రాజశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం**

? రావినూతలలో పగటి వేళ కూడా విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. సమస్యను పరిష్కరించగలరు. **- చంద్ర, రావినూతల**

✔ గ్రామంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి ఏర్పాటు పూర్తి అయిన తరువాత అన్ని వీధి దీపాల మరమ్మతులు చేయిస్తాం. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, రావినూతల -న్యూస్‌టుడే, మేదరమెట్ల**

మిరప నారు కొనేవారు లేరాయె

తగ్గిన సాగు.. పొగాకు వైపు రైతుల మొగ్గు

అద్దంకి, మార్టూరు, న్యూస్‌టుడే


అధిక వర్షాలతో పంట దెబ్బతినడం, నష్టాలు, మద్దతు ధర తగ్గిన నేపథ్యంలో మిరప సాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. ఇదే సమయంలో వైట్‌బర్లీ పొగాకు వేసిన వారికి ఎకరాకు ఖర్చులు పోను రూ.70-80 వేలు మిగలడంతో అధిక శాతం మంది అటువైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో షేడ్ నెట్లలో పెంచిన మిరప నారుకు పెద్దగా గిరాకీ లేకపోవటంతో ఆయా పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో మార్టూరు, ఇంకొల్లు, జే పంగులూరు, అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, యద్దనపూడి తదితర మండలాల్లో దాదాపు ఆరు వేల హెక్టార్లలో మిరప సాగులో ఉండేది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువ శాతం రైతులు వైట్‌బర్లీ పొగాకు, మొక్కజొన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈఏడాది ఇప్పటి వరకు కేవలం రెండు వేల హెక్టార్లలో మాత్రమే మిరప సాగు చేశారు. అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి వద్ద షేడ్‌నెట్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో అభ్యుదయ రైతు దేవినేని కోటేశ్వరరావు 12 ఎకరాల్లో మిరప మొక్కలు పెంచారు. 1.80 కోట్ల మొక్కలు విక్రయించారు. ఇంకా షేడ్‌నెట్‌లో మరో రెండుకోట్ల మిరపనారు పెంచుతున్నారు. ప్రస్తుతం నారు కావాలని అడిగిన వారు తగ్గిపోయినట్లు కోటేశ్వరరావు చెబుతున్నారు. గతేడాది పదిక రాల్లో మిరప పంటలు సాగు చేసిన రైతులు ఈసారి ఐదెకరాలకు పరిమితమవుతున్నారని, మరికొందరు సాగుకు ఆసక్తి కనబరచడం లేదని చెప్పారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని సంతమాగులూరు, కొమ్మాలపాడు, గరికపల్లి, బొల్లాపల్లి, రావినూతల, అద్దంకి, మార్టూరులోని షేడ్‌నెట్‌లో మిరపనారు పెంచుతున్నారు. ఈసారి పెద్దగా గిరాకీ లేకపోవటంతో పెంపకందారులు నష్టపోతున్నారు. గత ఏడాది మిరప మొక్క ఒక్కొటి రూ.1.50 నుంచి రూ.2 పలికింది. ప్రస్తుతం రూ.1.20 పైసలు పలుకుతోంది.



చిన్నకొత్తపల్లి షేడ్‌నెట్‌లో పెంచిన మిరపనారు

రైతులు నష్టపోతున్నారు



సాగుకు ఎకరాకు గరిష్ఠంగా రూ.లక్ష ఖర్చు అవుతుంది. పంటపై చీడపీడల ప్రభావం పెరిగింది. దీంతో రైతులు నష్టపోతున్నారు. అదే వైట్‌బర్లీ సాగు చేసిన వారు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం వస్తుంది. ఇదే విధానం కొనసాగితే రాబోయే ఏడాది నుంచి మిరప నారు సాగు చేయడం కష్టమే.

- దేవినేని కోటేశ్వరరావు, షేడ్‌నెట్ రైతు, చిన్నకొత్తపల్లి, అద్దంకి మండలం

ఖర్చులు పెరిగాయి

మిరప సాగు చేపట్టిన రైతులకు ఖర్చులు పెరిగాయి. దిగుబడి విషయం చీడపీడలపై ఆధారపడి ఉంది. తేజ రకం లాంటి మిర్చి అయితే ఆశించిన ధర లభిస్తుంది. మిగిలిన రకాలకు మద్దతు ధర లేకుండా పోయింది. ఇదే సమయంలో పొగాకు ధర ఆశాజనకంగా ఉండటంతో మిరప సాగు తగ్గుదలకు దోహదం చేస్తుంది.

- డి.సుబ్బారెడ్డి, ఏవో, జే పంగులూరు

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను జూమ్ సమావేశం ద్వారా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం తెలుసుకున్నారు. ఆయా మండలాల ప్రజలు, పార్టీ సానుభూతిపరులతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలను నియోజకవర్గ ప్రజలతో పంచుకున్నారు.

నేటి నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు మంగళవారం నుంచి రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 20 పంచాయతీల్లోని ఉప సర్పంచులు, ప్రతి గ్రామం నుంచి ఒక మహిళ వార్డు సభ్యురాలు, వార్డు సభ్యుడి వంతున శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

చినగంజాం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సమావేశ భవనంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ఉప సర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

బల్లికురవ(అద్దంకి): మండల పరిషత్తు కార్యాలయం వద్ద పంచాయతీ ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యుల చొప్పున శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు.

బాల్య వివాహాలపై అప్రమత్తత అవసరం

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే : బాల్యవివాహాలపై స్థానికులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, బాల్య వివాహాల నిరోధక కమిటీ బాధ్యులతో ఆమె మాట్లాడారు. స్థానికంగా ఉండేవారికి తెలియకుండా ఎలాంటి బాల్యవివాహాలు జరగవని, చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. మండల పరిషత్తు సాధారణ సమావేశం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదు

అద్దంకి : జీవిత బీమా పరిధిలో పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం చేకూర్చే విధంగా ఉన్న యాజమాన్య నిర్ణయాలను తక్షణం వెనక్కు తీసుకోవాలని ఏజెంట్ల సంఘం నేతలు అన్నారు. ఆ మేరకు అద్దంకి జీవిత బీమా కార్యాలయ మేనేజరు మాధవ కృష్ణకు వినతిపత్రం అందించారు.


శక్తి ప్రదాయిని.. చండీ మాత



పర్చూరులో లలిత త్రిపుర సుందరి దేవిగా..



కారంచేడులో వైష్ణవి దుర్గామాతగా..



ద్రోణాదులలో రాజరాజేశ్వరీదేవిగా..

దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకొని చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని ఆలయాలు కిటకిటలాడాయి. అయిదోరోజైన సోమవారం అమ్మవారు మహాచండీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు చండీ దేవిని సంపద, విద్య, కీర్తి లభించాలని కోరుకున్నారు. పలుచోట్ల అమ్మగారి విగ్రహాలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. **-న్యూస్‌టుడే బృందం**



అన్నపూర్ణదేవిగా..



సోపిరాల శివాలయంలో..



మేదరమెట్లలో..



ఇంకొల్లులో..



మార్టూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



మల్లేశ్వరస్వామికి అలంకరణ



మహిళలు, బాలికల కోలాట ప్రదర్శన



చీరాలలో బతుకమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో..

అద్దంకి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు.. పాడి పంటలతో తులతూగాలంటూ విజయదశమి సందర్భంగా అద్దంకి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ కమిటీ ఛైర్మన్ వూటుకూరి రామకోటేశ్వరరావు తోపాటు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్లు కొణిజేటి విజయలక్ష్మి, అత్తులూరి రమేష్‌బాబు స్వాగతం పలికారు.



పరమేశ్వరి ఆలయంలో మంత్రి గొట్టిపాటి



కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



దత్తపాదుకా క్షేత్రంలో..



పోలేరమ్మ ఆలయంలో..

అటక దిగని ఫాగింగ్ యంత్రాలు



గ్రామాల్లో దోమల నియంత్రణకు రూ. లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. కొరిశపాడు మండలం పమిడిపాడు ఇదే పరిస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అధికారులు అటకపై నుంచి కిందకు దించలేదు. ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకుంటే దోమల నియంత్రణకు ఉపయోగపడుతుంది. సమస్యపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివారావు వివరణ కోరగా వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.


-న్యూస్‌టుడే, పమిడిపాడు, (మేదరమెట్ల)

ఈ రహదారిలో కాలు కదపాలన్నా కష్టమే!



అద్దంకి, న్యూస్‌టుడే : నిరంతరం రద్దీగా ఉండే రామాటాకీస్ బజారులో వాహనంపై వెళ్లడం అటుంచితే నడవడం కూడా కష్టంగా మారింది. తాజాగా రహదారిని విస్తరించినా దుకాణదారులు రోడ్డు వరకూ ఆక్రమించడం, దుకాణాల ఎదుట ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచడంతో నడక కూడా కష్టంగా మారింది. వాహనదారులు సమస్యను పరిష్కరించాలి కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అద్దంకి**

రోడ్డు పక్కనే పొంచి ఉన్న ప్రమాదం



కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని అద్దంకి రోడ్డులో మార్కెట్ యార్డు సమీపంలో రహదారి పక్కన ఉన్న ఎండిపోయిన వేప చెట్టు ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియక వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా ఈ రోడ్డు ఎండిపోయిన చెట్టు కూలిపోయిన సంఘటనలో కొంతమందికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. గాలి ఎక్కువగా ఉన్న సమయంలో వాహన చోదకులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును ముందుగానే తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మేదరమెట్ల**

పాఠశాలకు ఆట వస్తువుల బహూకరణ

ఇంకొల్లు, న్యూస్‌టుడే: స్థానిక వరలక్ష్మి ఛారిటబుల్ ఆధ్వర్యంలో ఇంకొల్లులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రూ. లక్ష వ్యయంతో వసతులు కల్పించారు. శాంతినికేతన్ పాఠశాల నిర్వాహకులు వరలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం వరలక్ష్మి 8వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమె పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా పాఠశాలలో ఊయల, జారుడుబల్ల, రంగుల రాట్నం పలురకాల ఆటవస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సినిమా హాళ్ల కూడలిలో అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు సుబ్బయ్య, రామకృష్ణ, కిరణ్‌కుమార్, లావణ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వరలక్ష్మి కటుంబ సభ్యులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో లక్ష్య క్రీడాకారుల సత్తా

చీరాల, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈనాడు లక్ష్య క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలలో ఒక బంగారు, 5 రజత, 3 కాంస్య పతకాలు సాధించినట్లు శిక్షకుడు పులుగు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు రాజమహేంద్రవరంలో జరిగాయి. ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన ఈ పోటీల్లో చీరాలలోని ఈనాడు లక్ష్యా సెంటర్ క్రీడాకారులు పది మంది బాపట్ల జిల్లా జట్టు తరుపున పాల్గొన్నారు. ఇందులో 16 సంవత్సరాల లోపు విభాగం లాంగ్‌జంప్‌లో వి.యశ్వంత్‌రాజ్ బంగారు పతకం సాధించగా 20 సంవత్సరాల విభాగంలో పి.మహాలక్ష్మి 200, 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో రజత పతకాలు సాధించింది. 18 ఏళ్ల విభాగంలో సుంకర శేష వెయ్యి మీటర్ల పరుగులో కాంస్యం, మిడ్లే రిలేలో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఇదేవిభాగంలో బి.శ్యామ్యూల్ హెప్టాత్‌లాన్‌లో కాంస్యం, వంశీ కార్తీక్ 110 మీటర్ల హార్డిల్స్‌లో కాంస్యం, మిడ్లే రిలేలో రజతం, హరిశంకర్ మిడ్లే రిలేలో రజత పతకం సొంతం చేసుకున్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

వెంపరాల మేజరులో చిల్లచెట్ల తొలగింపు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో పనులు ప్రారంభం

ఎస్ఎల్.గుడిపాడు (అద్దంకి), న్యూస్‌టుడే : వెంపరాల మేజరులో పేరుకుపోయిన చిల్ల చెట్ల తొలగింపు ప్రక్రియ సోమవారం ప్రారంభించారు. ఎన్నెస్పీలో తగినంత నిధులు లేమి కారణంగా ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వం కాలువల నిర్వహణ పూర్తిగా విస్మరించింది. తాజాగా సాగర్ జలాశయంలో నీరు సమృద్ధిగా ఉండటంతో కాలువలకు నీరు విడుదల చేశారు. కాలువలో దట్టంగా పెరిగిన చిల్లచెట్ల కారణంగా నీటి పారుదల కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో రైతుల గోడు విన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. చిల్లచెట్లు తొలగించి నీటి పారుదలకు మార్గం సుగమం చేసుకోవాల్సిందిగా ఆయకట్టు రైతులకు భరోసా కల్పించారు. తదనుగుణంగా సోమవారం సాయంత్రం వెంపరాలకు చెందిన స్వయంపు సురేష్ నేతృత్వంలో ఎస్ఎల్.గుడిపాడు నుంచి చిల్ల చెట్ల తొలగింపు పనులు ప్రారంభించారు మొత్తం 12 కి.మీ. పొడవున గల ఈ కాలువ పరిధిలో వి.కొప్పెరపాడు, గొర్రెపాడు, గోవాడ, చిన్నకొత్తపల్లి, మైలవరం, వెంపరాల, ఉప్పలపాడు, చక్రాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రక్రియ పూర్తి అయితే నీటి సరఫరా మెరుగు అవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పొక్లెయిన్‌తో కాలువలో చెట్లు తొలగిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

క్రైం కార్నర్

పి.గుడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: రోడ్డు మధ్యలోని డివైడర్ దిమ్మెను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలోని జాతీయ రహదారి రన్‌వేపై సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఏలూరు నుంచి నెల్లూరు వెళ్తున్న బొలెరో వాహన చోదకుడు నిద్రమత్తులో రోడ్డు మధ్యలోని డివైడర్ దిమ్మెను ఢీకొట్టగా ఆ దిమ్మె కొంచెం జరిగింది. అదే సమయంలో ఒంగోలు నుంచి మార్టూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఆ దిమ్మెను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న మురికిపూడి మంజు, రమేష్‌లకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేట లోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిది మార్టూరు మండలం బొల్లాపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

హుండీ పగులగొట్టి సొమ్ము అపహరణ

ఇడుపులపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: ఇడుపులపాడు పోలేరమ్మ ముత్యాలమ్మ ఆలయాల ప్రాంగణంలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హుండీలో సొమ్ము చోరికి గురైంది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని సొమ్ము అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుడు గోరంట్ల సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ముస్తాఫా సోమవారం కేసు నమోదు చేశారు

భర్త వేధింపులపై కేసు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఈపూరుపాలేనికి చెందిన ధనలక్ష్మిని చిలకలూరిపేట సమీపంలోని గణపవరానికి చెందిన ఏసుబాబుతో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడంటూ భర్తపై చేసిన ఫిర్యాదు మేరకు గృహ హింస కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏరియా కో-ఆర్డినేటర్ లక్ష్మణాచారి

పర్చూరు (మార్టూరు), న్యూస్‌టుడే : ప్రభుత్వం మహిళా సంఘాలకు అందజేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఏరియా కో- ఆర్డినేటర్ ఎ.లక్ష్మణాచారి కోరారు. పర్చూరు మండల సమైఖ్య కార్యాలయంలో సోమవారం జీవనోపాధి పెంపొందించే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో సంఘాలు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందుకునేలా చూడాలని ఆయన కోరారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ధాతృత్వంతో స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు వీటిని అందించారు. వైద్యశాలకు ధర్మామీటర్లు సమకూర్చినట్లు వారు వెల్లడించారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

మార్టూరు, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని ప్రపంచ శాంతికి అన్ని దేశాలు దోహదపడాలని సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నేతలు బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, బి.కృష్ణయ్య కోరారు. సోమవారం మార్టూరులో వివిధ పార్టీల నేతలు ప్రపంచశాంతి నెలకొల్పాలంటూ ప్రదర్శన చేపట్టారు. జాతీయరహదారి అనుసంధాన మార్గంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

■ భారత మహిళల క్రికెట్ జట్టు ఇటీవల చెన్నైలో ఏ జట్టుతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు ఏకంగా 525 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది? (టెస్టు క్రికెట్ (పురుషులు కలిపి) చరిత్రలోనే మొదటిరోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత మహిళల జట్టు నిలిచింది. ఈ మ్యాచ్‌లో భారత క్రికెటర్ షెఫాలీ వర్మ టెస్టుల్లో తొలి శతకాన్నే ద్విశతకంగా మార్చింది. 194 బంతుల్లో 205 పరుగులు చేసి మహిళల టెస్టుల్లో అత్యంత వేగంగా ద్విశతకం సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది.) **జ:** దక్షిణాఫ్రికా

■ 18వ, ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏ రాష్ట్రంలోని 'కోట' స్థానం నుంచి బీజేపీ తరపున ఎంపీగా గెలుపొందారు? (మాడభూషి అనంతశయనం అయ్యంగార్, గుర్‌దయాళ్ సింగ్ ధిల్లాన్, బలరాం జాఖడ్, జీఎంసీ బాలయోగి తర్వాత రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన వ్యక్తిగా ఓం బిర్లా రికార్డు సృష్టించారు. తొలి విడతలో అయిదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని వరుసగా రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన తొలివ్యక్తి బలరాం జాఖడ్ కాగా ఓం బిర్లా ఆ కోవలో రెండో వ్యక్తి.) **జ:** రాజస్థాన్

■ చంద్రుడి అవతలి వైపు భాగంలోని మట్టిని భూమి పైకి సురక్షితంగా చేర్చిన మొదటి దేశంగా ఏది రికార్డు సృష్టించింది? **జ:** చైనా

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

ప్రతి సబ్జెక్టు లేదా పాఠాన్ని అధ్యయనం చేయడానికి నిర్ణీత కాలాన్ని కేటాయించుకోవాలి. ఆ టైమ్‌లోగా పూర్తిచేయడానికి ప్రయత్నించాలి. ఆ విధంగా చేస్తే ఒక క్రమంలో సిలబస్ ప్రిపరేషన్ సాగుతుంది. రివిజన్‌కు అవసరమైనంత సమయం దొరుకుతుంది.

డీఎస్సీ/టెట్ - 2024
ఇంగ్లిష్ మెథడాలజీ

TENTH Social Studies



To establish Supremacy

POWER SHARING

Q&A

1 Mark

1) Which language was recognized as the only official language of Sri Lanka in 1956?

A. Sinhala

2) Apart from the Central and the State governments, which is the third type of government practised in Belgium?

A. Community government

3) Define majoritarianism.

A. Majoritarianism is rule by majority community by disregarding the needs and wishes of the minority community.

4) What measure was adopted by the democratically elected government of Sri Lanka to establish Sinhala Supremacy?

A. In 1956, an Act was passed to make Sinhala the official language. The government followed preferential policies favouring Sinhala applicants for University positions and government jobs.

5) What is the language spoken by the people residing in the Wallonia region of Belgium?

A. People residing in Wallonia region of Belgium speak French.

6) After independence, Sri Lanka witnessed the supremacy of which community?

A. Sri Lanka emerged as an independent country in 1948 and the democratically elected government adopted a series of measures to establish Sinhala supremacy.

Some More Important Questions

2 Marks

1) What is a Coalition Government?

2) What is meant by the system of 'checks and balances'?

3) What is the system of checks and balances in power sharing?

4) Why is power sharing desirable? Explain one reason.

For Answers

\- KSV Krishna Reddy

SUBSCRIBE CHANNEL

అర్థవంతమైన గుణధర్మాల అమరిక!

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

మెడికల్ షాపులో వందల రకాల మందులు ఉన్నా, అడిగిన మెడిసిన్ వెంటనే దుకాణదారుడు తెచ్చి ఇచ్చేస్తాడు. సూపర్ బజార్‌లో ఏ వస్తువు కావాలంటే దాని దగ్గరకు నేరుగా వెళ్లిపోవచ్చు. కారణం ఆ మందులైనా, ఈ వస్తువులైనా ఒక క్రమంలో అమరి ఉంటాయి. అందుకే తేలిగ్గా అందుబాటులో ఉంటాయి. అదే విధంగా రసాయన శాస్త్రంలో అనేక రకాల మూలకాలు ఉన్నాయి. లక్షణాలను, గుణధర్మాలను అనుసరించి శాస్త్రవేత్తలు వాటిని వర్గీకరించారు. మూలకాలను అర్థం చేసుకోవడానికి, కొత్తవాటిని కనిపెట్టడానికి ఆ విభజన ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షల కోణంలో ముఖ్యమైన మూలకాల వర్గీకరణ గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి. అందులోని వివిధ నియమాలనూ అర్థం చేసుకోవాలి.



మూలకాల వర్గీకరణ


భౌతిక రసాయన మార్పుల ద్వారా ఏదైనా పదార్థాన్ని అంతకంటే మరింత సూక్ష్మ పదార్థంగా విభజించలేకపోతే అదే మూలకం అని రాబర్ట్ బాయిల్ నిర్వచించాడు. 1661లో కేవలం 13 మూలకాలకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. 18వ శతాబ్దం చివరి నాటికి లెవోఇజర్ కాలంలో మరో 11; 1865 నాటికి దాదాపు 63 మూలకాలను కనుక్కున్నారు. 1940 నాటికి సహజ వనరుల నుంచి 91 మూలకాలు కనుక్కున్నారు. మరో 17 కృత్రిమంగా తయారుచేశారు. ప్రస్తుతం వాటి సంఖ్య 118.

డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం: ఈయన జర్మన్ రసాయన శాస్త్రవేత్త. ఒకే రకమైన రసాయన ధర్మాలున్న మూడేసి మూలకాల సమూహాలను గుర్తించి వాటిని త్రికం అని పేర్కొన్నాడు. 'ప్రతి త్రికంలో మధ్య మూలకం పరమాణు భారం మిగిలిన రెండు మూలకాల పరమాణు భారాల సరాసరికి దాదాపు సమానంగా ఉంటుంది.' అని డాబర్‌నీర్ ప్రతిపాదించాడు. దీన్నే 'డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం' అంటారు.

ఉదా: Li, Na, K; Ca, Sr, Ba; Cl, Br, I డాబర్‌నీర్ త్రికాలు

పరిమితులు: * డాబర్‌నీర్ కాలం నాటికి తెలిసిన మూలకాలన్నింటినీ త్రికాలుగా అమర్చలేకపోయాడు. * ఈ సిద్ధాంతం అత్యధిక లేదా అత్యల్ప ద్రవ్యరాశులున్న మూలకాలకు వర్తించలేదు. * పరమాణు ద్రవ్యరాశిని కచ్చితంగా కొలిచే పరికరాలు అభివృద్ధి చెందిన తర్వాత ఈ సిద్ధాంతం కచ్చితమైందిగా నిలవలేకపోయింది.

న్యూలాండ్స్ అష్టక నియమం : జాన్ న్యూలాండ్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త 1865లో మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు అవి 7 గ్రూపులుగా ఏర్పడతాయని కనుక్కున్నాడు. ఆ విధంగా ఏర్పడిన గ్రూపుల్లో ఉండే మూలకాలు ఒకేవిధమైన రసాయన ధర్మాలతో ఉంటాయని గమనించాడు. దీని ఆధారంగా ఆయన అష్టక నియమాన్ని ప్రతిపాదించాడు.



లెవోఇజర్


అష్టక నియమం: మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు వాటి ధర్మాలు నిర్ణీత వ్యవధుల్లో పునరావృతమవుతాయి. ఒక మూలకం నుంచి మొదలుపెడితే ప్రతి ఎనిమిదో మూలకం ధర్మాలు మొదటి మూలక ధర్మాలను పోలి ఉంటాయి. దీన్నే 'న్యూలాండ్స్ అష్టక నియమం' అంటారు. **ఉదా:** F, Na, Mg, Al, Si, P, S, Cl

* న్యూలాండ్స్ మూలకాల పట్టికలో హైడ్రోజన్‌తో మొదలుపెడితే ఎనిమిదో మూలకమైన ఫ్లోరిన్, ఆ తర్వాత ఎనిమిదో మూలకమైన క్లోరిన్‌లు ఒకేరకమైన ధర్మాలను ప్రదర్శిస్తాయి.

పరిమితులు: * న్యూలాండ్స్ ఒకేగడిలో రెండు మూలకాలను పొందుపరిచాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్ * పూర్తిగా భిన్నమైన ధర్మాలున్న కొన్ని మూలకాలను ఒకే గ్రూపులో అమర్చాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్, పెల్లాడియం, ప్లాటినం లాంటి వాటి ధర్మాలకు భిన్నంగా ఉన్న హాలోజన్ మూలకాలైన ఫ్లోరిన్ క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్‌లను అమర్చాడు. * ఇతడి అష్టక నియమం క్యాల్షియం వరకు సరిగ్గానే వర్తించింది. * క్యాల్షియం కంటే ఎక్కువ పరమాణు ద్రవ్యరాశి ఉన్న మూలకాలకు ఇది వర్తించలేదు. * న్యూలాండ్స్ మూలకాల రసాయన ధర్మాల్లో ఆవర్తన క్రమాన్ని సంగీత స్వరాల్లోని ఆవర్తనంతో పోల్చాడు. ఉదాహరణకు భారతీయ సంగీతంలో ఒక స్కేలులో ఏడు సంగీత స్వరాలుంటాయి. ఎనిమిదో స్థానం తిరిగి మొదటి స్వరం (స) పునరావృతమవుతుంది. అవి స, రి, గ, మ, ప, ద, ని, స. * న్యూలాండ్స్ పట్టిక 56 మూలకాలకు మాత్రమే పరిమితమైంది. కొత్తగా కనిపెట్టబోయే మూలకాలకు ఎలాంటి ఖాళీలను విడిచిపెట్టలేదు.




డాబర్‌నీర్



న్యూలాండ్స్

మెండలీఫ్ ఆవర్తన పట్టిక: మెండలీఫ్ అనే రష్యన్ శాస్త్రవేత్త అప్పటి వరకు తెలిసిన మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చి.. 8 నిలువు వరుసలు, 7 అడ్డ వరుసలుగా ఏర్పాటు చేశాడు. * నిలువు వరుసలను గ్రూపులుగా, అడ్డువరుసలను పీరియడ్లుగా పేర్కొన్నాడు. * గ్రూపులను ఎ, బి అనే ఉప గ్రూపులుగా విభజించాడు. * గ్రూపుల్లోని మూలకాలు ఒకే రసాయన ధర్మాలను ప్రదర్శిస్తాయి. * ఉప గ్రూపుల్లో మూలకాల రసాయన ధర్మాలు దాదాపు దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటాయి.

* మెండలీఫ్ తన ఆవర్తన పట్టిక అమరికలో లభ్యంకాని మూలకాలకు ఖాళీ గదులను విడిచిపెట్టాడు. అలాగే భవిష్యత్తులో కనుక్కోబోయే మూలకాలకు తాత్కాలిక పేర్లను సూచించాడు. **ఉదా:** * ఎకా బోరాన్ - స్కాండియం * ఎకా అల్యూమినియం - గాలియం * ఎకా సిలికాన్ - జెర్మేనియం. * గాలియం అనే మూలకం అరచేతిలో పెట్టుకుంటే కరిగిపోతుందని ముందుగానే ఊహించి చెప్పాడు. * ఇప్పటి వరకు చెల్లాచెదురుగా ఉన్న వంటశాల లాంటి రసాయన శాస్త్రానికి మెండలీఫ్ పట్టిక ఒక చక్కని అమరిక ఇచ్చింది. * మెండలీఫ్ రసాయన శాస్త్రానికి చేసిన కృషికి 101వ మూలకానికి మెండలీవియం అని పేరుపెట్టారు.



మెండలీఫ్

పరిమితులు: * మెండలీఫ్ తన పట్టికలో అధిక పరమాణు భారం ఉన్న మూలకాన్ని (టెలూరియం Te-127) తక్కువ పరమాణుభారం ఉన్న మూలకం (అయోడిన్ I - 126) కంటే ముందు వరుసలో ఉంచాడు. * ఇతడు ఒకే గ్రూపుల్లో విభిన్న ధర్మాలున్న మూలకాలను ఏర్పాటు చేశాడు.

ఉదా: 1A గ్రూపు మూలకాలైన Li, Na, K లాంటి వాటిని 1B గ్రూప్ మూలకాలైన Cu, Au, Ag లాంటి వాటితో ఏర్పాటు చేశాడు.

* అదేవిధంగా 6A గ్రూపు మూలకాలైన క్లోరిన్ (అలోహం)ను 6B గ్రూపు మూలకానికి చెందిన Mn (లోహం)తో ఏర్పాటు చేశాడు.



రచయిత: చంటి రాజుపాలెం

అందరి ఆమోదంతో నూతన కౌలుచట్టం

- అభిప్రాయాలు తెలిపిన రైతులు, సంఘాల నాయకులు
- ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు మాధవి, శ్రావణ్‌కుమార్, నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మీ తదితరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కౌలు రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా అందరి ఆమోదంతో నూతన కౌలు చట్టాన్ని రూపొందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. నూతన కౌలు చట్టం రూపకల్పనపై తొలి ప్రాంతీయ సదస్సు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత చట్టాలకు మిన్నగా కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే భూ యజమానులు, కౌలురైతులు, రైతు సంఘాలందరితోనూ సమావేశమై అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారికి రుణాలు మంజూరు చేసేలా ప్రస్తుత చట్టంలో మార్పులు చేశామన్నారు. సాగు చేసిన పంటపై కౌలు రైతుకు హక్కు ఉంటుందే గాని భూమిపై ఉండదన్నారు. తద్వారా భూమి యజమానులకు ఇబ్బంది ఉండదన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ నూతన చట్టంలో జిల్లా స్థాయి అధికారిని అప్పిలేట్ అధికారిగా నియమిస్తే బాగుంటుందన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వ్యవసాయ శాఖకు కేటాయించడం వల్ల ఇబ్బందులున్నాయన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రసంగించారు.

- ప్రాంతీయ సదస్సులో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన రైతు సంఘాలు, రైతులు, కౌలు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైతు సంఘాల నాయకులు హరిబాబు, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆన్‌లైన్ సేవలు ప్రజలకు మరింత చేరువ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రవాణా శాఖలో ప్రభుత్వం చేపడుతున్న ఆన్‌లైన్ సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేస్తామని గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి స్పష్టం చేశారు. డీటీసీగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ కమిషనరేట్‌లో డీటీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీతారామిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన 1994లో ఎంవీఐగా రవాణా శాఖలో చేరారు. బాపట్ల, చీరాల, కావలి, నెల్లూరులో ఎంవీఐగా పని చేశారు. నెల్లూరులో ఎంవీఐగా విధులు నిర్వర్తించే సమయంలో ఆర్టీఓగా పదోన్నతి లభించింది. తిరుపతి, విజయవాడల్లో ఆర్టీఓగా సేవలందించారు. 2019లో డీటీసీగా పదోన్నతి లభించింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ వాహన్, సారథి ద్వారా అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఓవర్‌లోడింగ్, అధిక వేగం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి ఆర్టీఓ గోపాల్, పలువురు ఎంవీఐలు.. సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధికి ఊతంగా పొగనారుమళ్లు

- పలు గ్రామాల్లో పెంచుతున్న రైతులు
- ప్రస్తుతం ఆరు వేల మొక్క మూట ధర రూ.2 వేలు



గోపాళంవారిపాలెం వద్ద పొగనారు మళ్లు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

చిలకలూరిపేట ప్రాంతంలో గ్రామీణ రైతులకు పొగనారు మళ్ల పెంపకం ఉపాధికి ఊతంగా మారింది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు పరిసర ప్రాంత రైతులకు నారు అందించేందుకు ఈ ప్రాంత రైతులు వీటిని పెంచుతున్నారు. దశాబ్దాలుగా పొగ నారుమళ్లకు ప్రసిద్ధిగాంచిన మురికిపూడితో పాటు రామచంద్రాపురం, రాజాపేట, గోపాళంవారిపాలెంలో విస్తృతంగా వీటిని సాగు చేస్తున్నారు. ప్రధానంగా తెల్ల బర్లీ, నల్ల బర్లీ నారుమళ్ల సాగు ఎక్కువగా ఉంది. ఎకరాకు 200 మండల వరకు నారు పెంచుతారు. దీనికి వ్యవసాయం, విత్తనాలు, సాగునీరు, కలుపు, బలం మందులు, పురుగు మందులు కలిపితే ఎకరాకు రూ.2లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. నాలుగు మడుల్లో ఒకసారి నారు తొలగిస్తే 6 వేల మొక్కలు వస్తాయి. ప్రస్తుతం వీటిని ఉంచే మూట ఖరీదు రూ.2 వేలుగా ఉంది. ఇలా ఎకరాకు ఒకసారి తొలగిస్తే 80 మూటల నారు వస్తుంది. 5 సార్లు తొలగిస్తే 400 మూటల నారు వస్తుంది. మూట రూ.2 వేలు పలికినా రూ.8 లక్షలు వస్తాయి. ఖర్చులన్నీ పోనూ రూ.6 లక్షల వరకు ఆదాయం వస్తుంది. గతేడాది డిమాండ్ బాగా పెరగడంతో మూట నారు రూ.12 వేలు పలికింది. దీంతో ఈ ప్రాంతంలో రైతుల పంట పండింది. ప్రధానంగా చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు, బల్లికురవ, యద్దనపూడి, సంతమాగులూరు, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా నారు కొంటారు.



గిరాకీని బట్టి ఉంటుంది



పొగ నారుకు డిమాండ్‌ను బట్టి ఆదాయం ఉంటుంది. ఒక్కొక్కసారి నారు పలుచగా వస్తే తక్కువ దిగుడి వస్తుంది. అలాంటప్పుడు ఆదాయం తగ్గుతుంది. వర్షాలు ఎక్కువగా పడినా నారు దెబ్బతింటుంది. అన్నీ బాగుండి ధర కలిసివస్తే మంచి ఆదాయం వస్తుంది. ఈ ఏడాది ఎకరాలో సాగు చేపట్టాను. ప్రస్తుతం ధర మూట రూ.2 వేలు ఉంది. **- గోరంట్ల సాంబశివరావు, గోపాళంవారిపాలెం**

వర్షాకాలం.. పశు ఆరోగ్యం జాగ్రత్త

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతంలో రైతులు పోషణలో పశు సంపద కీలకపాత్ర పోషిస్తోంది. వర్షాకాలంలో పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని గురజాల మండల పశు సంవర్ధకశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఆవులు, గేదెలు ఈ కాలంలో గొంతువాపుతో బాధ పడుతుంటాయి. దీన్ని గురక వ్యాధి అంటారు. దీని బారిన పడిన పశువును మంద నుంచి తప్పించాలి. తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్ టాజు వంటి ఇంజక్షన్లు ఇస్తే మంచిది. తెల్ల ఆవులు, ఎద్దులకు జబ్బువాపు సోకకుండా బీక్యూ వ్యాక్సిన్లు, గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి రాకుండా ఈటీ వ్యాక్సిన్లు ఇవ్వాలి. గొర్రె పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు పుట్టగానే ధనుర్వాతం రాకుండా టెటనస్ టాక్సాయిడ్ ఇంజక్షన్ చేయించాలి. 3, 4, 5 రోజుల్లో యాంటీ బయోటిక్ పౌడరును నీళ్లలో కలిపి తాగించడం, ఏడు రోజుల్లో లివర్ టానిక్స్ తాగించాలి. పారుడు, మసూచి రాకుండా టీకాలు ఇవ్వాలి.



పాముపొడ పని పడదాం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : వరిలో పాముపొడ తెగులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్ సూచించారు. పైరు దుబ్బు చేసే సమయంలో ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా తెగులు తీవ్రత ఎక్కువ అవటానికి ఆస్కారం ఉందన్నారు. మబ్బులతో కూడిన వర్షం, చెట్లనీడ, పైరు నేలపై పడిపోయినపుడు తెగులు త్వరగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తెగులు తొలుత గట్ల నుంచి ప్రారంభమవుతుందని, కనుక ముందుగా గట్లపై కలుపు మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తెగులు నివారణకు లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. వీటిలో ఏదైనా ఒకదానిని కలిపి పిచికారి చేస్తే తెగులు నివారించుకోవచ్చని, తెగులు లక్షణాలు కనిపించినపుడు నత్రజని వాడకం తగ్గించాలని ఆయన సూచించారు.

కందిలో వెర్రి తెగులు.. నివారణ చర్యలు



వెర్రి తెగులు సోకిన కంది పైరు

వినుకొండ, న్యూస్‌టుడే : కంది పైరును కొన్నేళ్లుగా వెర్రి తెగులు సోకి నష్టపరుస్తోంది. ఇరియోఫిడ్ మైట్ అని పిలిచే నల్లి దీన్ని వ్యాప్తి చేస్తుంది. తెగులు లక్షణాలు, నివారణ చర్యలను ఆచార్య ఎన్జీరంగ విశ్వవిద్యాలయం విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఈదర వెంకటేశ్వర్లు వివరించారు.

కనిపించే లక్షణాలు

ఆకులు లేత ఆకుపచ్చ రంగులో అక్కడక్కడ పసుపు రంగు మచ్చలతో చిన్న పరిమాణంలో సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. కొమ్మలు విస్తరించడం తక్కువగా ఉంటుంది. కొన్ని పూత లేకుండా ఉంటాయి. పూత కాయగా మారడం చాలా తక్కువగా ఉంటుంది. కాయలో గింజలు చిన్న పరిమాణంలో ఉంటాయి. తెగులు ఉద్ధృతి ఉంటే పంట నష్టం అధికంగా ఉంటుంది.

నివారణ చర్యలు

ఐసీసీయల్- 87119, 85063, యల్ ఆర్‌జీ- 105 కంది రకాలు ఈ తెగులు కొంత తట్టుకునే శక్తి ఉంటుంది. గత సంవత్సరం వెర్రి తెగులు ఆశించిన చోట మందులు పిచికారి చేసి నివారించవచ్చు. పైరు విత్తిన 35-40 రోజుల్లో నీటిలో కరిగే గంధకం 80 శాతం (థయోవిట్, ట్రైఫాల్, సల్‌టాఫ్) ఎకరాకు 600 గ్రాముల చొప్పున పిచికారి చేయాలి. రెండోసారి 60- 70 రోజుల సమయంలో ప్రొపార్‌గైట్ 57 శాతం (ఓమైట్) ఎకరాకు 400 మి.లీ. పిచికారి చేయాలి.